క్లుప్తంగా

ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి

జడ్జి శ్రీనివాసరావు



నూజివీడు: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ఎల్ శ్రీనివాసరావు ఆకాంక్షించారు. స్థానిక ఎస్ఆర్ఆర్ హైస్కూల్లో శనివారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఎవరూ దోచుకోలేనిది విద్య అని, దానిని ప్రతిఒక్కరూ నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థి దశలో కష్టపడితేనే భవిష్యత్‌లో సుఖపడతారన్నారు. ప్రతి వ్యక్తి ప్రాథమిక విధులు, హక్కులు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం ప్రసాదరావు పాల్గొన్నారు.

పారదర్శకంగా సీఎం జగన్ పాలన

మైలవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన పారదర్శకంగా ఎలాంటి అవినీతి, లంచాలు, వివక్షకు తావు లేకుండా సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన 50 నెలల్లో ఏకంగా రూ.2.31లక్షల కోట్లను అత్యంత పారదర్శకంగా పేదలకు అందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. సంక్షేమ పథకాల సొమ్మును అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాలకే నేరుగా జమ చేస్తూ మహిళా సాధికారతకు బాటలు వేసిన ముఖ్యమంత్రి జగన్ అని ఎమ్మెల్యే తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: స్థానిక టౌన్ సబ్‌స్టేషన్, ట్రిపుల్‌ఐటీ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల నిమిత్తం ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ డీఈ ఓలేటి దుర్గారావు తెలిపారు. హనుమాన్‌జంక్షన్ రోడ్డు, చిన్నగాంధీబొమ్మ సెంటర్, ఆర్‌ఆర్ పేట, ఎంప్లాయీస్ కాలనీ, అమ్మవారితోట, బ్యాంకు స్ట్రీట్, కోనేరుపేట, వెలమపేట, పెద్ద గాంధీబొమ్మ సెంటర్, బాపూనగర్, శ్రీనివాససెంటర్, ఢంఢం గార్డెన్ ఏరియా, గొడుగువారిగూడెం, ఉషాబాలా నగర్, కుమ్మరిపేట, స్టేషన్‌తోట, గాంధీనగర్, యానాదుల కాలనీ, మైలవరం రోడ్డు, అజరయ్యపేట, ముస్లింపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు.

టీకాల కార్యక్రమం తనిఖీ



తిరువూరు: తిరువూరు మండలం పల్లెర్లమూడిలో శనివారం నాటి టీకాల కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ పీజే అమృతం తనిఖీ చేశారు. చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రతి బుధ, శనివారాల్లో గర్భిణులు, చిన్నారులకు వేసే టీకాల కార్యక్రమంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆమె సిబ్బందికి ఆదేశాలిచ్చారు. పీహెచ్‌సీలో టీకాల కార్యక్రమ రికార్డులు తనిఖీ చేసిన అనంతరం వైద్యులు కల్యాణ్‌చక్రవర్తి, పూజితకు సూచనలిచ్చారు.

ఏపీ గ్రంథాలయాల పితామహుడు పాతూరి

పటమట(విజయవాడతూర్పు): గ్రంథాలయాల అభివృద్ధే తన ఊపిరిగా జీవించి ఏపీలో గ్రంథాలయోద్యమాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లిన ఘన పాతూరి నాగభూషణంకు దక్కుతుందని న్యూఢిల్లీకి చెందిన సెంటర్‌ఫర్ మీడియా స్టడీస్ నిర్వాహకులు డాక్టర్ నాగులపల్లి భాస్కరరావు అన్నారు. శనివారం పాతూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని సర్వోత్తమ భవనంలో పాతూరి పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ఆయన మాట్లాడుతూ వివాదరహితుడిగా ఈ రంగాన్ని నడిపారన్నారు. ఏపీ గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు కేసీ కల్కురా మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి బాటలు వేసిన పాతూరి సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పాతూరి పురస్కారం విశ్రాంత ఆచార్యులు, ప్రకృతి ఆరోగ్య శాస్త్ర గ్రంథాలయ స్థాపకులు డాక్టర్ గజ్జల రామేశ్వరానికి అందించారు. అనంతరం పలు పోటీల్లో గెలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు. కార్యక్రమంలో రచయిత్రి చంద్రలత, గ్రంథాలయ సంఘం కార్యదర్శి రావి శారద, సర్వోత్తమ గ్రంథాలయ అధ్యక్షులు డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య, వెలిదండ్ల హనుమంతరామయ్య, గ్రంథాలయం అధ్యక్షులు డొకిపర్తి శంకరరావు, రామ్మోహన గ్రంథాలయ కార్యదర్శి వి. కేశవరావు, కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, సాహితీవేత్తలు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారుల విజయకేతనం

- అడవినెక్కలం సర్పంచ్‌గా వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి ఘన విజయం
- మెజారిటీ వార్డు సభ్యులు కూడా వైఎస్సార్ సీపీ మద్దతుదారులే..



అడవినెక్కలం సర్పంచ్‌గా గెలుపొందిన వేము రాజుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారులు

నూజివీడు: నియోజకవర్గంలో శనివారం నిర్వహించిన పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఉపఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీలో నిలిచిన అభ్యర్థులు ఘన విజయం సాధించారు. పోలింగ్ అనంతరం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు నిర్వహించారు. ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం పంచాయతీ సర్పంచ్ పదవికి నిర్వహించిన ఎన్నికలో వైఎస్సార్ సీపీ మద్దతుతో బరిలో నిలిచిన వేము రాజు 323 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. ఈ పంచాయతీలో మొత్తం ఓట్లు 1,616 కాగా 1,281 ఓట్లు పోలయ్యాయి. ఇందులో వైఎస్సార్ సీపీ మద్దతుతో బరిలోకి దిగిన వేము రాజుకు 719 ఓట్లు రాగా, టీడీపీ మద్దతు తెలిపిన అభ్యర్థి పులపాక చిన్నబ్బాయికి 396 ఓట్లు, పిల్లి శేషయ్య (రెబల్ అభ్యర్థి)కు 148 ఓట్లు వచ్చాయి. నోటాకు ఐదు ఓట్లు రాగా, 13 ఓట్లు చెల్లలేదు. నూజివీడు మండలం అన్నవరంలో ఐదో వార్డు సభ్యుని ఎన్నికకు పోలింగ్ నిర్వహించగా వైఎస్సార్ సీపీ మద్దతులో పోటీ చేసిన పులపాక పుల్లారావు 53 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మొత్తం ఓట్లు 240 ఓట్లు కాగా 216 ఓట్లు పోలయ్యాయి. పులపాక పుల్లారావుకు 131 ఓట్లు రాగా, టీడీపీ మద్దతు పలికిన ప్రత్తిపాటి జోజికి 78 ఓట్లు వచ్చాయి. నోటాకు ఒక ఓటు రాగా, ఆరు ఓట్లు చెల్లలేదు.

అడవినెక్కలంలో సంబరాలు

ఆగిరిపల్లి మండలం అడవినెక్కలంలో సర్పంచ్ పదవిని వైఎస్సార్ సీపీ మద్దతుతో బరిలోకి దిగిన వేము రాజు ఘన విజయం సాధించడంతో గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాల్లో మునిగితేలారు. గతంలో కూడా వైఎస్సార్ సీపీ మద్దతుతోనే సర్పంచ్ పదవిని గెలుచుకోగా, మళ్లీ ఇప్పుడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మొక్కపాటి కిరణ్ ఆధ్వర్యంలో మళ్లీ సర్పంచ్ పదవిని కైవసం చేసుకుని తిరుగులేదని నిరూపించారు.



సర్పంచ్ ఎన్నికలో గెలుపొందడంతో సంబరాలు చేసుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఓటర్లకు ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే

పంచాయతీలకు నిర్వహించిన ఉపఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీలోకి దిగిన అభ్యర్థులను గెలిపించిన ఓటర్లకు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు, ప్రభుత్వ పనితీరుకు ఈ ఫలితాలే నిదర్శనమన్నారు. గెలుపొందిన సర్పంచ్, వార్డు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

వార్డులో వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి గెలుపు



హరిబాబు

ఎర్రమాడు(తిరువూరు): మండలంలోని ఎర్రమాడు పంచాయతీలో ఏడో వార్డుకు జరిగిన ఉప ఎన్నికలో వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి చలివేంద్రం హరిబాబు గెలుపొందారు. శనివారం జరిగిన ఉప ఎన్నికలో 134 ఓట్లకు 126 పోలయ్యాయి. వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థికి 63, తెలుగుదేశం బలపరచిన అభ్యర్థి వేము మార్తారావుకు 62 పోలయ్యాయి. వార్డు సభ్యుడిగా ఎన్నికైన హరిబాబును గ్రామ సర్పంచ్ బొర్రా మాధవి, వైఎస్సార్ సీపీ నాయకులు మోహనరావు అభినందనలు తెలిపారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు

ఎమ్మెల్యే రక్షణనిధి

ఏ.కొండూరు: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే కే రక్షణనిధి పేర్కొన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం రూ.50 లక్షల వ్యయంతో నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా నూతనంగా నిర్మించే బ్లాక్‌పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనానికి శంకుస్థాపన చేశారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో రూ.25లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులు, ఒక కోటి 15 లక్షల వ్యయంతో నిర్మించిన విద్యార్థుల భోజన శాల అదనపు భవనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల కోరిక మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ మండలంలో కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నామని, నూతనంగా నిర్మించే ఈ ల్యాబ్ ద్వారా రోగులకు అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహించి వ్యాధులు నిర్ధారించి వారికి అవసరమైన వైద్యం అందిస్తారన్నారు. ఇకనుంచి ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు చేసి రక్త పరీక్షలు చేయించుకునే విధానానికి స్వస్తి పలికి ప్రభుత్వ ఆస్పత్రిలోనే రక్త పరీక్షలు చేయించుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో వత్సవాయి, వెలగలేరు, తిరువూరు నియోజకవర్గాల్లో ఈ బ్లాక్ హెల్త్ యూనిట్ ల్యాబ్‌ను మంజూరు చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఖరీదైన వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ మండలంలో కిడ్నీ బాధితులకు ప్రతి నెలా రూ.10వేల పింఛన్, ఉచిత వైద్యం, మందులు అందిస్తున్నామని, ఇటీవల రూ.10.70 లక్షలతో నూతనంగా డయాలసిస్ కేంద్రం నిర్మించి, ఆ కేంద్రం ద్వారా డయాలసిస్ రోగులకు వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని సహకారంతో ఈ మండలంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అన్ని రకాల వసతులు కల్పించి వారికి వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతన భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను విద్యార్థులకు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, నాడు-నేడు, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, అమ్మ ఒడి పలు రకాల పథకాలు ప్రవేశపెట్టి విద్యార్థులకు అన్ని రకాల వసతులు పాఠశాలల్లో కల్పించి మెరుగైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ గిరిజన ఆశ్రమ పాఠశాలలో డిజిటల్ తరగతి గదులు ప్రారంభించామని స్మార్ట్ టీవీ ద్వారా విద్యాబోధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్య గనియా, సర్పంచ్‌లు వి.రజిని, బి.ఝాన్సీ, వైస్ ఎంపీపీ ఎస్.పద్మ, ఎంపీటీసీ సభ్యుడు పుల్లారావు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు టి.సురేష్, జిల్లా వైద్యాధికారి సుహాసిని, నాయకులు కే చెన్నారావు, టి. వెంకటేశ్వరరెడ్డి, బి.వెంకయ్య, పి.ఆంజనేయులు, ఎస్ నరసింహారావు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ రవికాంత్, వైద్యాధికారి స్వాతి, పీఆర్ డీఈ చక్రవర్తి, డీటీడబ్ల్యూఓ రుక్మాన్గదయ్య, హెచ్ఎం జి.కవిత తదితరులు పాల్గొన్నారు.

ముసునూరులోనూ వైఎస్సార్ సీపీ మద్దతుదారులే..



ముసునూరు 11వ వార్డు విజేత కె.వనిత



వేల్పుచర్లలో 10వ వార్డు విజేత మహేశ్వరరావు

ముసునూరు: మూడు గ్రామాల్లో మూడు వార్డులకు ఒకటి వైఎస్సార్ సీపీ మద్దతుదారుడికి ఏకగ్రీవం కాగా, మిగిలిన రెండు గ్రామాల్లోని రెండు వార్డులకు శనివారం ఉప ఎన్నికలు జరిగాయి. వేల్పుచర్ల 10వ వార్డుకు వైఎస్సార్ సీపీ మద్దతుదారుడు దుక్కిపాటి మహేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముసునూరులోని 11వ వార్డుకు వైఎస్సార్ సీపీ మద్దతుదారు కొడవలి వనిత 46 ఓట్ల ఆధిక్యంతో ప్రత్యర్థి కలపాల నలోమిపై విజయం సాధించారు. మొత్తం 279 ఓట్లు పోలవ్వగా వనితకు 161 ఓట్లు, నలోమి 115 ఓట్లు సాధించారు. మూడు ఓట్లు చెల్లలేదు. గతంలో ఈవార్డు వైఎస్సార్ సీపీ మద్దతుదారుదే కాగా అదే పార్టీ అభ్యర్థి తిరిగి నిలబెట్టుకున్నారు.

- కాట్రేనిపాడులో 10వ వార్డులో 276 ఓట్లు పోలవ్వగా, వైఎస్సార్ సీపీ మద్దతుదారు పేరిచర్ల రంగారావు 97 ఓట్లు సాధించారు. ప్రత్యర్థి కాజ రాజ్యలక్ష్మి 175 ఓట్లు సాధించి, గెలుపొందారు. నాలుగు ఓట్లు చెల్లలేదు. విజేతలుగా నిలిచిన వార్డు సభ్యులను వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, మాజీ సర్పంచ్‌లు గోపాలకృష్ణ, పి.కుటుంబరావు, సుబ్బారావు, పార్టీ సీనియర్ నేతలు లోకేశ్వరరావు, రామారావు మిఠాయిలు తినిపించి, శుభాకాంక్షలు తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

తిరువూరు: ప్రజలు రాజ్యాంగం తమకు ప్రసాదించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మోతీలాల్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. బాలలకు, మహిళలకు, వినియోగదారులకు హక్కులున్నాయని, వాటి పరిరక్షణకు పటిష్ట చట్టాలు అమలులో ఉన్నాయని తెలిపారు. వివిధ చట్టాల గురించి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అంజన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది అత్తునూరు ప్రభాకరరెడ్డి, మేకల నాగేంద్రప్రసాద్, రామకృష్ణ, శ్రీనివాసరావు, వెంకటరెడ్డి వివరించారు. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు బీ దాసు, ఎస్తేరురాణి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బడేమియా పాల్గొన్నారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి మోతీలాల్

ప్రశాంతంగా పంచాయతీ ఉప ఎన్నికలు



ఆగిరిపల్లి మండలం అడవినెక్కలంలో ఓటేసేందుకు బారులు తీరిన ఓటర్లు



నూజివీడు మండలం అన్నవరంలో ఓటేసేందుకు వచ్చిన వృద్ధుడిని తీసుకెళ్తున్న పోలీసులు

నూజివీడు: నూజివీడు నియోజకవర్గంలో మూడు వార్డు సభ్యులు, ఒక సర్పంచ్ పదవులకు శనివారం నిర్వహించిన ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం ఒంటి గంటలకు ముగిసింది. ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం పంచాయతీ సర్పంచ్ పదవికి జరిగిన ఉపఎన్నిక పోలింగ్‌లో 1,616 ఓట్లకు 1,281 ఓట్లు పోలయ్యాయి. సర్పంచ్ పదవికి ముగ్గురు అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఎంపీడీఓ పి.శంకర్‌రావు, తహసీల్దార్ ఉదయభాస్కర్ పోలింగ్‌ను పర్యవేక్షించారు.

- నూజివీడు మండలం అన్నవరం పంచాయతీలో ఐదో వార్డు సభ్యుడి ఎన్నికల్లో మొత్తం ఓట్లు 240 ఓట్లకు 216 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ సజావుగా నిర్వహించేలా రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ నేతృత్వంలో పటిష్టవంతమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ముసునూరు మండలం కాట్రేనిపాడు పంచాయతీలో 10వ వార్డుకు మొత్తం 322 ఓట్లకు 276 ఓట్లు, ముసునూరు పంచాయతీలో 11వ వార్డుకు మొత్తం 325 ఓట్లకు 279 ఓట్లు పోలయ్యాయి. రెండు గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మూడు మండలాల్లో జరిగిన ఎన్నికల బందోబస్తును రూరల్ సీఐ రాజులపాటి అంకబాబు పర్యవేక్షించారు.

మేలైన సేద్య పద్ధతులతో అధిక దిగుబడులు



జి.కొండూరు: రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు మెరుగైన సేద్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులను పొందవచ్చని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మాధవీలత అన్నారు. మండల పరిధి కుంటముక్కల గ్రామంలో మెరుగైన సేద్య పద్ధతులు అనే అంశంపై వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని వ్యవసాయాధికారులు శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో కేవీకే కీటక విభాగం శాస్త్రవేత్త రాజశేఖర్, మైలవరం ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ రాంకుమార్ పాల్గొన్నారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక మహాత్మాగాంధీ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు విజయవాడ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ మెంబర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పరుచూరి నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు కాంప్లెక్స్‌లోని సొసైటీ కార్యాలయంలో డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్ నిర్వాహకులు ఉచిత నేత్ర పరీక్షలు, రెటీనాకు సంబంధించిన పరీక్షలతోపాటు కేటరాక్ట్ పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ జయప్రదం చేయాలి

మైలవరం: మైలవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి ముద్దరబోయిన శైలజ పిలుపునిచ్చారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన సమావేశంలో జడ్జి శైలజ మాట్లాడుతూ రాజీ పడేందుకు అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్, వరకట్నం వేధింపులు, బ్యాంక్ చెక్కు కేసులు పరిష్కారం చేసుకుని, కక్షిదారులు తమ సమయం, డబ్బు ఆదా చేసుకోవాలని పేర్కొన్నారు. కోర్టు ప్రాంగణంలో పోలీస్, న్యాయవాదులతో సమావేశమయ్యారు. సమావేశంలో మైలవరం బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు పీ పద్మశ్రీ, ప్రధాన కార్యదర్శి బుద్దవరపు వెంకట్రావు, న్యాయవాది దినేష్, ఎక్సైజ్ సీఐ, జీ.కొండూరు, రెడ్డిగూడెం, మైలవరం ఎస్సైలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి శైలజ

వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయం

ఏ.కొండూరు: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో శ్రీమన్నారాయణ ఎంటర్‌ప్రైజెస్ అధినేత ఎస్వీఎస్ పిచ్చయ్యరావు ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు ఎపేర్కొన్నారు. మండలంలోని చీమలపాడు జాతీయ రహదారి పక్కన రూ.5 లక్షల వ్యయంతో ఆదామా ఇండియా వారి సీఎస్ఆర్ వారు ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను తహసీల్దార్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సౌత్ ఇండియా బిజినెస్ అధినేత జి. పాపునాయుడు, జనరల్ మేనేజర్ ఎం. హనుమంతరావు, ఏజీఎం ఎం.శ్రీనివాసరావు, ప్రొడక్ట్ మేనేజర్ టి.శాంతిలతా, రీజినల్ మేనేజర్ టీవీ చలపతిరావు, సర్పంచ్ మోర్ల లక్ష్మి, సాంబశివరావు పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ డే

ఇబ్రహీంపట్నం: అంతర్జాతీయ ఫొటోగ్రఫీడేను ఇబ్రహీంపట్నం మండల యువత ఫొటోగ్రఫీ, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక పవిత్రసంగమం వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ జాక్వెస్ మండే డాగురే చిత్రపటానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించి కేక్ కట్‌చేశారు. ఫొటోగ్రాఫర్స్ నేడు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలని అసోసియేషన్ ప్రతినిధి కృష్ణారావు కోరారు. అందరూ సోదరభావంతో మెలగాలన్నారు. కృష్ణారావు, రాంబాబు, ఈశ్వరాచారి, నరసింహారావు, నరేంద్ర, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.




లూయిస్ జాక్వెస్ మండే డాగురే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

రూ. లక్ష విలువైన గ్రంథాలు అందజేత

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కొల్లూరి శనివారం తన కార్యాలయంలో పిల్లలమర్రి పినవీరభద్ర కళాపీఠానికి చెందిన గ్రంథాలయాలకు రూ.లక్ష విలువైన గ్రంథాలను అందజేశారు. వాటిని కళాపీఠానికి చెందిన తెలంగాణ ప్రతినిధి శీల అవిలేనుకు కొల్లూరి సతీమణి కనకవల్లి వితరణగా ఇచ్చారు. కనకల్లి మాట్లాడుతూ విలువైన గ్రంథాలు అందరికీ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు.

జాప్ స్క్రిప్ట్ ఫ్రేమ్ వర్క్ ఆధారంగా వెబ్ అప్లికేషన్ అభివృద్ధి

మైలవరం: జాప్ స్క్రిప్ట్ ఫ్రేమ్ వర్క్ ఆధారంగా వెబ్ అప్లికేషన్ అభివృద్ధి చేయవచ్చని, నాలుగు కీలక సాంకేతికాలైన మాంగో డిబి ఎక్స్‌ప్రెస్, కోణీయ, నోడ్‌లను ఉపయోగించి స్టాక్ లేయర్లను రూపొందించవచ్చని టీమ్ లీడ్ ఇన్ అప్లైడ్ మెటీరియల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధి, పూర్వ విద్యార్థి కే శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగం వెబ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ యూసింగ్ మీన్ స్టాక్ అనే అంశంపై శనివారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ వెబ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ యూసింగ్ మీన్ స్టాక్ ప్రాముఖ్యతలను క్షుణ్ణంగా వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు మాట్లాడుతూ కళాశాలలో పూర్వ విద్యార్థులు ఇస్తున్న శిక్షణ ద్వారా విద్యార్థులు ప్రపంచ స్థాయి కంపెనీలలో పోటీ పడగల నైపుణ్యం సంపాదించగలరని తెలిపారు. పూర్వ విద్యార్థుల ద్వారా ప్రస్తుత విద్యార్థులు ప్రేరణ పొందుతారన్నారు. కార్యక్రమంలో సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ డీ వీరయ్య, డాక్టర్ సీహెచ్ వెంకటనారాయణ కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు.



శిక్షణ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

రావిచర్లలో పంచ ప్రాణ ప్రతిజ్ఞ

నూజివీడు: మండలంలోని రావిచర్ల గ్రామ సచివాలయం వద్ద శనివారం మన మట్టి మన దేశం కార్యక్రమం నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, దేశభక్తి గీతాలు ఆలపించారు. ఎన్ఎస్ఎస్ ప్రొఫెసర్ రమేష్ విద్యార్థులు, సిబ్బంది గ్రామ పంచాయతీ స్థాయి, రక్షణ సిబ్బందిని సన్మానించారు. అనంతరం పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాపా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాల (విజయవాడ) విద్యార్థులు జాతీయ ప్రచారంలో భాగంగా మన మట్టి మన దేశం కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం ఆనందంగా ఉందని చెప్పారు. గ్రామంలో 150 మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను చేపట్టినట్టు చెప్పారు. ఉత్సవాలు, ఊరేగింపులు, పెళ్లి, పేరంటం, పుట్టినరోజు ఇలా వేడుక ఏదైనా మొక్కలు నాటి సంరక్షించే కార్యక్రమాన్ని జీవితాంతం కొనసాగించాలని కోరారు. జాతీయ నాయకులను స్మరిస్తూ, వారి పోరాట గాథలను తెలుసుకుని, వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. డీన్ స్టూడెంట్ అఫైర్స్ ఎస్‌వీకే కృష్ణకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టీవీఎస్ శ్యామ్ కుమార్, దీపక్ కుమార్ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ టెక్నాలజీపై అవగాహన

ఆగిరిపల్లి(నూజివీడు): మండలంలోని పోతవరప్పాడులో ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ట్రెనింగ్ ప్లేస్‌మెంట్ విభాగం, ఏపీఐటీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ టెక్నాలజీపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీఐటీఏ సీఓఓ డీవీ రాజకోటిరెడ్డి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ఆధునిక సాంకేతికతపై సర్టిఫికేషన్ డోర్స్ చేసుకున్న వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని చెప్పారు. ఈ దిశగా ఏపీఐఐ కూడా ఇంజినీరింగ్ విద్యార్థులకు అధునాతన టెక్నాలజీస్‌పై శిక్షణ తరగతులు, సర్టిఫికేషన్ రూపొందిస్తున్నట్టు తెలిపారు. అకడమిక్ అఫైర్స్ డైరెక్టర్ నాయర్ విద్యార్థులకు టెక్నికల్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, ఫారిన్ లాంగ్వేజస్ అయిన ఫ్రెంచ్, జర్మనీపై శిక్షణ ఇచ్చేందుకు కార్యావరణ రూపొందిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ కళాశాల చైర్మన్ ఆర్.వెంకట్రావు, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ యురేంద్రబాబు పాల్గొన్నారు.

700 మందికి శ్రీవారి అన్నప్రసాదం

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యాన పున్నమ్మతోటలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాగణంలో శనివారం 700 మంది శ్రీవారి అన్నప్రసాదం స్వీకరించారు. దాత శ్రీకాకుళపు శ్రీనివాసరావు, వీరరాఘవమ్మ సహకారంతో స్వామి వారికి మహానివేదన సమర్పించి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. వేంకటేశ్వర స్వామికి శనివారంతో కూడిన శ్రావణమాసం కావడంతో శ్రీవారికి సహస్రనామార్చన చేశారు.

లబ్బీపేట వేంకటేశ్వర స్వామి ఆలయంలో..

కంచికామకోటి పీఠపాలితక శారదా చంద్రమౌళీశ్వర స్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి పంచామృత స్నానం, నవగ్రహ అర్చన నిర్వహించారు.